క్లుప్తంగా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో ఒంగోలు, మద్దిపాడు, కొండపి ప్రాజెక్టుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పీఆర్సీ ఐఆర్ 5 శాతం, రిటైరైన అంగన్‌వాడీలకు రూ.2 లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సేవచేస్తున్న అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు కోరారు.

మొక్కల ప్రాముఖ్యతపై ర్యాలీ

ఒంగోలు: మొక్కల ప్రాముఖ్యతపై స్థానిక క్విస్ పాఠశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక కర్నూల్ రోడ్డులోని క్విస్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి తాలూకా పోలీసుస్టేషన్ వరకు వన్ స్టూడెంట్- వన్ ట్రీ అనే కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలో నినాదాలు చేశారు. అనంతరం సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్సై అంకమ్మచౌదరి, ఏఎస్సై సీహెచ్ కోటేశ్వరరావులకు మొక్కలు అందించారు. వారితో కలిసి మొక్కలు నాటారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి: మండలంలోని ఉప్పలపాడు 33 కేవీ విద్యుత్ లైన్ పీఎంఐ వర్క్ జరుగుతున్న కారణంగా చీమకుర్తి, నార్త్ సబ్‌స్టేషన్, ఆర్.ఎల్.పురం పరిధిలోని పరిశ్రమలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చీమకుర్తి పవర్ ఆఫీస్ ఏఈ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. గృహ, పరిశ్రమల యజమానులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఖైదీ మృతిపై 12న మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట (విశాఖ దక్షిణ): నెల్లూరు సెంట్రల్ జైలులో ఖైదీగా ఉన్న రాయపాటి నాగరాజు మృతిపై ఈ నెల 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నట్టు విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు మండలానికి చెందిన రాయపాటి నాగరాజును చికిత్స కోసం ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీ విశాఖలో కేజీహెచ్‌కు తరలించారు. అదే నెల 21న సాయంత్రం 6.45కు చనిపోయాడని ఆర్‌డీవో తెలిపారు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నిర్ణయించారు. విచారణ అధికారిగా విశాఖ ఆర్‌డీవోను నియమించారు. విశాఖ ఆర్‌డీవో కార్యాలయంలో 12న ఉదయం 11 గంటలకు మెజిస్టీరియల్ విచారణ చేస్తున్నామని, రాయపాటి నాగరాజు మరణం గురించి తెలిసిన వారు ఎవరైనా విచారణకు హాజరై లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆర్‌డీవో ఒక ప్రకటనలో తెలిపారు.

పేస్‌లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 2011 నుంచి కాలేజీలో చదువుకున్న 800 మందికిపైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. వారు కాలేజీలో చదువుకున్న రోజులు మొదలు ప్రస్తుతం తాము ఎక్కడెక్కడ, ఏ స్థానంలో ఉన్నది చర్చించుకుంటూ కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై రైతులను అప్రమత్తం చేయాలి

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను పలు తెగుళ్లు, పురుగులు ఆశిస్తున్న నేపథ్యంలో రైతులను సస్యరక్షణపై అప్రమత్తం చేయాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త అన్నపూర్ణ సూచించారు. ఒంగోలులోని జిల్లా వనరుల కేంద్రం నుంచి జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు, వీఏఏలు, సిబ్బంది, ఆర్‌బీకే పరిధిలో రైతులకు శనివారం వెబెక్స్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో వరి, కంది, పత్తి పంటలలో వివిధ దశలలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన ధాతు లోప మందులు, పిచికారీ మందుల గురించి వివరించారు. డీఆర్‌సీ ఏవోలు శైలజారాణి, వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థికసాయం

నాగులుప్పలపాడు: దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పుగుండూరు ఎస్సీకాలనీకి చెందిన దేశ బుల్లియ్యకు సామాజిక సేవా కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్ శనివారం రూ.12 వేలు ఆర్థికసాయం అందించారు. బుల్లియ్య లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం చెన్నై వెళ్లేందుకు ఆ మొత్తాన్ని అందించారు.



పోస్టల్‌కాలనీలో పశువుల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, తదితరులు



రాజీవ్‌గృహకల్ప 6వ లైన్‌లో సిమెంట్ రోడ్డు, కాలువల ప్రారంభం...



సౌత్‌బైపాస్ జంక్షన్‌లో పార్కుకు శంకుస్థాపన...

నగరంలో అభివృద్ధి పరుగులు

ఒంగోలు నగరంలో భారీగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో పూర్తయిన వాటిని శనివారం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న అభివృద్ధి పనులను మేయర్ గంగాడ సుజాత, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.



కొత్తమామిడిపాలెంలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌ను ప్రారంభిస్తూ...

పేదలందరికీ కార్పొరేట్ వైద్యం



కనపర్తిలో వృద్ధురాలికి అందించిన కళ్లజోడును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు



తక్కెళ్లపాడులో మందుల గురించి వివరిస్తున్న ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ యాదాల అశోక్‌బాబు



గాజులపాలెంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- అందుబాటులోకి తీసుకొచ్చిన సీఎం జగనన్న
- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. మద్దిపాడు మండలంలోని గాజులపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల ఆరోగ్యంపై ఇంత శ్రద్ధ తీసుకునే ముఖ్యమంత్రిని గతంలో ఎక్కడైనా చూశారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తీసుకునే ప్రతి నిర్ణయంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. సమన్యాయం, ఆర్థిక సమానత్వం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు అన్ని విధాలుగా ఆయనకు అండగా నిలిచి మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి పథకాన్ని ఇంటికొచ్చి అందిస్తూ మంచి సేవలను వలంటీర్లు అందిస్తున్నారన్నారు. గతంలో దోచుకో పంచుకో దాచుకో అనే నినాదంతో టీడీపీ నాయకులు పనిచేసేవారన్నారు. కానీ ఇప్పుడు మధ్యవర్తులు ఎవరూ లేకుండా పథకాల ఫలాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పడిపోతున్నాయని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, అందువలన వారిని మోసం చేయాలనుకోవడం మూర్ఖత్వమవుతుందని టీడీపీ నాయకులకు హితవు పలికారు. టీడీపీ ఎన్నికల సమయం వచ్చేసరికి మళ్లీ జగనన్న ఏర్పాటు చేసిన పథకాలకు పేరు మార్చి అధిక మొత్తంలో డబ్బు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే అన్నారు. సొంతగా ఒక్క పథకాన్ని కూడా ఏర్పాటు చేయలేని అసమర్థ నాయకుడు చంద్రబాబు అని విమర్శించారు. ముందుగా జగనన్న ఆరోగ్య శిబిరంలో రోగులు వారి పేర్లు రిజిస్టర్ చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్పెషలిస్టు డాక్టర్లు అందిస్తున్న వైద్యసేవలు, వారికిస్తున్న మందులను ఎమ్మెల్యే టీజేఆర్ పరిశీలించారు. మెగా మెడికల్ క్యాంప్‌లో 319 మందికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులందించి ప్రత్యేక చికిత్స అవసరమైన వారికి దగ్గరలోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం డాక్టర్లు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణకోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, గ్రామ సర్పంచ్ తిప్పారెడ్డి కోటిరెడ్డి, పార్టీ నాయకులు తేళ్ల పుల్లారావు, సర్పంచ్‌లు నాగమల్లీశ్వరి, బొమ్మల రామాంజనేయులు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రజని, కార్డియాక్ స్పెషలిస్ట్ చైతన్య, ఆర్థోపెడిక్ సర్జన్ చిడితోటి జీవన్, ఆస్పత్రి డాక్టర్లు జగదీష్, వినీల చౌదరి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మడనూరులో...

మడనూరు (కొత్తపట్నం): మడనూరు గ్రామంలోని ఎంపీపీ స్కూల్ ఆవరణలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీలు వాయల మోహన్‌రావు, బలగాని శ్రీనివాసరావు, సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు సామంతుల వీరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాయల మోహన్‌రావు మాట్లాడుతూ వైద్యం ఎంతో ఖర్చుతో కూడిందని, ఒంగోలు వెళ్లి చూపించుకోవడానికి శక్తి లేక ఇంటికే పరిమితమైన వాళ్లు చాలా మంది ఉన్నారని తెలిపారు. ఇటువంటి పేద వాళ్ల కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఇక్కడ నయం కాని జబ్బులకు కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకోవడానికి రూ.5 లక్షల వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ముందు రోజు ఇంటికొచ్చి మీకు ఏ వ్యాధి ఉందని గుర్తించి గ్రామంలోనే వైద్య వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు కూడా పంపిణీ చేస్తున్నారన్నారు. పలువురికి కళ్లజోళ్లు, హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. 422 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి కోటేశ్వరమ్మ, మత్స్యకార వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, ఉపసర్పంచ్ వెంకట్రావు, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, బిల్లా చెన్నయ్య, డాక్టర్ వెంకటేష్, రమణారెడ్డి, బొమ్మిరెడ్డి శంకరరెడ్డి, ఎంపీడీవో పి.సుజాత, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, వాయల రోశయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మెడికల్, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీ తక్కెళ్లపాడు గ్రామంలో...

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సంతనూతలపాడు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం సంతనూతలపాడు మండలం పీ తక్కెళ్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని చెంచిరెడ్డితో పాటు ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ స్థానిక సర్పంచ్ ఆలూరి సుశీల చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన వారినుద్దేశించి వారు మాట్లాడుతూ ప్రజలందరికీ ఉచితంగా వైద్యం అందించి ఆరోగ్యంగా ఉంచాలనే లక్ష్యంతో సీఎం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్‌లు వైద్యపరీక్షలు చేసిన అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సొసైటీ ప్రెసిడెంట్ బీ శివరామయ్య, ఏ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది,ఏఎన్‌ఎంలు,ఆశావర్కర్లుపాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవాలి...

పేదల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని ఆరోగ్యశ్రీ రాష్ట్ర స్పెషలాఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం సంతనూతలపాడు మండలం పీ తక్కెళ్లపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్యశిబిరంలోని డాక్టర్లు ఇచ్చిన మందులను పరిశీలించారు. రోగులనుద్దేశించి అశోక్‌బాబు మాట్లాడుతూ ఇంటింటికి ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం ప్రాధాన్యతను రోగులకు వివరించారు.

కనపర్తిలో...

నాగులుప్పలపాడు: మండలంలోని కనపర్తి-1 సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం పేదలకు చాలా ఉపయోగకరంగా ఉందన్నారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. ఐసీడీఎస్ వారు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, త్రినాథ్‌రెడ్డి, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో జయమణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీ పరిశీలన...

కనపర్తి-1 సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నాగులుప్పలపాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ యాదాల రత్నభారతి పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నా రాధ, లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కంచర్ల సుధాకర్, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండువవారిపాలెంలో...

ఒంగోలు రూరల్:మండలంలోని మండువవారిపాలెంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఒంగోలు తహసీల్దార్ పసుపులేటి మురళి ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ సుందరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి భవాని, ఈఓపీఆర్డీ ఎం.రమణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. పలువురికి కళ్లజోళ్లు అందజేశారు.



మడనూరులో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ మోహన్‌రావు, అధికారులు



తక్కెళ్లపాడులో మందులు పంపిణీ చేస్తున్న దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

సచివాలయంలో ఆధార్ కేంద్రం ప్రారంభం

మడనూరు (కొత్తపట్నం): మడనూరు సచివాలయంలో నూతన ఆధార్ కేంద్రాన్ని సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో ఆధార్ కేంద్రం లేనందున ఒంగోలు వెళ్లి తీయించుకున్నప్పుడు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పుడు గ్రామంలోనే ఆధార్ కేంద్రం పెట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రెడ్డి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి, డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నూతన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు

పేదలను ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో చేర్పించాలి

ఒంగోలు సబర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలను స్వయం సహాయక గ్రూపుల్లో చేర్పించాలని గ్రూపుల సమాఖ్య సభ్యులను డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్ ఆదేశించారు. స్థానిక టీటీడీసీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం సమాఖ్య సభ్యులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సమాఖ్య సభ్యుల విధులు, బాధ్యతల గురించి వివరించారు. జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో డీపీసీ జీఎం శ్రీనివాసరావు, డీపీఎం కృపారావు, ఏపీఎం గంటా శ్రీనివాసరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అవకాశాలు...

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక రకాల అవకాశాలు కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ తెలిపారు. ఒంగోలు దక్షిణ బైపాస్‌లోని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జగనన్న బడుగు వికాసం, పీఎంఈజీపీ పథకాల కింద ఔత్సాహికులైన లబ్ధిదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. డీఆర్‌డీఏ, వైఎస్సార్ కేపీ, జిల్లా పరిశ్రమల శాఖలు సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు జగనన్న బడుగు వికాసం పథకం అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ జీఎం శ్రీనివాసరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ షేక్ అబ్దుల్ రహీం, జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ బ్రాంచ్ మేనేజర్ శ్యామల, డీఆర్‌డీఏ డీపీఎంలు పి.డేవిడ్, బి.సుబ్బారావు, ఆడిటర్ కుమార్, డీఐసీ ఐపీఓ ధనలక్ష్మి, కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ నగేష్ పాల్గొన్నారు.

విద్య, ఉద్యోగ అవకాశాలను ఉపయోగించుకోవాలి

ఒంగోలు సెంట్రల్: యువతకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, ఉద్యోగ అవకాశాలను ఉపయోగించుకుని జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని జిల్లా స్టెప్ మేనేజర్ పి.శ్రీమన్నారాయణ కోరారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ, స్టెప్ ఆధ్వర్యంలో స్థానిక డీఏ పాలిటెక్నిక్ కాలేజీలో శనివారం విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ పీవీఎల్ఎన్‌పీ శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీలో నైపుణ్యం సాధించి మంచి ఉద్యోగాలలో స్థిరపడాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలపై అనేక ఆశలతో కష్టపడి చదివిస్తారని, వారిని దృష్టిలో ఉంచుకుని స్థిరపడి సమాజంలో మంచి పేరు, స్థితి సంపాదించుకోవాలని ఆశించారు. యువజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత చెడు మార్గంలో నడుస్తూ అవకాశాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితంలో వచ్చిన అవకాశాలను ఒడిసి పట్టుకున్న వారే ఉన్నత స్థితికి చేరతారని వివరించారు. ప్లేస్‌మెంట్స్ అధికారి షేక్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఒంగోలు సెంట్రల్: జిల్లా ఎయిడ్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్ వారు సంయుక్తంగా శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి ప్రారంభించారు. అద్దంకి కేఆర్‌కే కళాశాల ప్రథమ బహుమతి దక్కించుకోగా, ద్వితీయ, తృతీయ బహుమతులను డీఎస్ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ పీఓ రంగారావు, అహ్మద్, రెడ్ రిబ్బన్ కన్వీనర్ విద్యులత, అధ్యాపకులు శ్రావణి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను తరిమేద్దాం

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు అవగాహనతో ప్లాస్టిక్‌ను దూరం చేయాలని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ కె.శ్యాంసునీల్‌కుమార్ సూచించారు. స్థానిక సెయింట్ థెరిస్సా హైస్కూల్లో శనివారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం ఆనందరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 2022 జూలై 1 నుంచి 125 మైక్రాన్ల కంటే తక్కువున్న ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదని ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. జన శిక్షణ సంస్థ పీఓ హరికృష్ణంరాజు, ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పరిశుభ్రతపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యానవనశాఖ లక్ష్యాలు చేరుకోవాలి

ఒంగోలు సెంట్రల్: ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సబ్సిడీల గురించి తెలియజేసి ఆ శాఖ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి వై.గోపీచంద్ కోరారు. ఒంగోలు ఉద్యానవనశాఖ కార్యాలయంలో శనివారం జిల్లాలోని క్లస్టర్ ఉద్యానవన శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమీకృత ఉద్యానవన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్)లో జిల్లాలో నిమ్మ, బత్తాయి, మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, కరోండో, నేరేడు పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు, గిద్దలూరు, కంభం, కనిగిరి, పామూరు, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి క్లస్టర్ ఉద్యానవనశాఖ అధికారులు శ్రీలక్ష్మి, విష్ణుప్రియ, సాయి శ్వేత, అంజలి భాయ్, కుసుమ, రమేష్, ఆదిరెడ్డి, రవి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

యంత్ర పరికరాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకంలో భాగంగా 45 చిరుధాన్యాలు, పప్పు దినుసులు, వెరుశనగ విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్లకు ఒక్కొక్క యూనిట్‌కు రెండు లక్షల వరకు రాయితీ ఇన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. మద్రిపూడి, దొనకొండ, పొదిలి, కొనకల మిట్ల, పామూరు, చంద్రశేఖర పురం, హనుమంతుని పాడు, దోర్నాల, పెద్దార వీడు, కొమరోలు మండలాలలో యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ప్రకాశం జిల్లా అధికారిక వెబ్ సైట్‌ను సందర్శించాలని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆర్‌ఏడీ పథక నోడల్ అధికారి (8331057054)ని సంప్రదించాలని కోరారు.